# ఆలోచించండి



20వ డివిజన్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

- అభివృద్ధి చేసే బీఆర్ఎస్ కావాలా... అడ్డుకునే కాంగ్రెస్, బీజేపీ కావాలా
- నా ఇంటిపై ఐటీ, ఈడీ దాడులు చేయించిన దరిద్రుడు బండి సంజయ్
- అక్రమ సంపాదనతో ఓట్ల రాజకీయం చేస్తున్నాడు
- బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్
- నగరంలోని 2, 20, 21వ డివిజన్లలో ప్రచారం

కార్పొరేషన్, నవంబర్ 24: తెలంగాణను అభివృద్ధి చేసే బీఆర్ఎస్ కావాలో, అభివృద్ధిని అడ్డుకునే కాంగ్రెస్, బీజేపీ కావాలో ప్రజలు ఆలోచించాలని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. నగరంలోని 20, 21, 2వ డివిజన్లలో శుక్రవారం ఆయన ప్రచారం చేశారు. మంత్రి గంగులకు స్థానిక మహిళలు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఆరెపల్లిలో యువత బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలో రోడ్లు లేక, తాగునీరు అందక, కరెంటు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఉండేదన్నారు. స్వరాష్ట్రంలో వేల కోట్ల నిధులు తీసుకువచ్చి నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దామన్నారు. అన్ని రోడ్లను సుందరంగా మార్చామని, నగరంలో ప్రతి వాడకు రోజూ మంచినీటి సరఫరా అందిస్తున్నామని తెలిపారు. కేసీఆర్ పాలనలో రెప్పపాటు కూడా కరెంటు పోవడం లేదని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పచ్చని తెలంగాణను చూసి ఆంధ్రోళ్లకు కడుపు మంట మొదలైందని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్ ముసుగులో కిరణ్ కుమార్‌రెడ్డి, పవన్‌కళ్యాణ్, షర్మిల, కేవీపీలు హైదరాబాద్‌లో అడ్డా వేశారని విమర్శించారు. మా ఆస్తులు ఇక్కడే ఉన్నాయని, హైదరాబాద్ సంపద మాదే అంటున్నారని ఆరోపించారు. తెలంగాణలో కేసీఆర్‌ను ఓడగొట్టేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ ఓడిపోతే ఆంధ్రా నాయకులు ఇక్కడ మళ్లీ పెత్తనం చేసి బతుకనివ్వరని హెచ్చరించారు. కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మి కేసీఆర్‌ను ఓడిస్తే నష్టపోయేది మనమేనని పేర్కొన్నారు. తెలంగాణను కాపాడుకోవాలంటే కేసీఆర్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ టికెట్లు అమ్ముకుందని, కరీంనగర్ టికెట్ ఓ రౌడీషీటర్‌కు ఇచ్చిందన్నారు. ఆయనపై ఇప్పటికే 32 భూకబ్జా కేసులు ఉన్నాయని, ఆయనను గెలిపిస్తే మన భూములు ఉంటాయా అని ప్రశ్నించారు. బండి నాపై రెండు సార్లు ఓడిపోయి గుండె పోటు డ్రామాతో ఎంపీగా గెలిచాడని విమర్శించారు. గెలిచిన తర్వాత ఎప్పుడైనా ప్రజలకు కనిపించారా అని ప్రశ్నించారు.? కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా తెచ్చి అభివృద్ధి చేయలేకపోయాడని దుయ్యబట్టారు. ఆ పార్టీలో చేసిన అవినీతికి ఉన్న రాష్ట్ర అధ్యక్ష పదవిని కూడా ఊడబీకారని, మళ్లీ ఎన్నికల్లో ఎంపీ టికెట్ ఎలాగు ఇవ్వరని తెలిసి ఇప్పుడు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎంపీగా బండి సంజయ్ నాలుగున్నర ఏండ్లు ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు. బీసీ బిడ్డ తుల ఉమకు టికెట్ ఇచ్చినట్లే ఇచ్చి తర్వాత ఇతరులకు అమ్ముకున్నారని విమర్శించారు. ఎంపీగా నాలుగున్నర ఏళ్లుగా సంపాదించిన అక్రమ డబ్బులతో ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలుద్దామని చూస్తున్నాడని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో ఓటుకు రూ.20 వేలు, సెల్‌ఫోన్ ఇచ్చి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. తాను కుటుంబ సభ్యులతో కలిసి బయటకు వెళ్లినప్పుడు ఈడీ, ఐటీ అధికారులను పంపించి, నా ఇంటి తాళాలను పగులగొట్టించారని మండిపడ్డారు. తనపై అక్కసుతోనే ఐటీ దాడులు చేయించాడని విమర్శించారు. తెచ్చుకున్న తెలంగాణను ఆంధ్రా దొంగల, ఢిల్లీ నాయకుల చేతుల్లో పెట్టొదన్నారు. ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. నాకు పెద్ద పదవి వస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. కేబుల్ బ్రిడ్జి, మానేరు రివర్ ఫ్రంట్, టీటీడీ ఆలయం, ఇస్కాన్ టెంపుల్, మెడికల్ కళాశాల, ఐటీ టవర్ తీసుకువచ్చానని, వీటిని తానే పూర్తి చేస్తానన్నారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఆసరా పింఛన్ రూ.5 వేలకు పెంచుతామని, రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని, కల్యాణలక్ష్మి సాయం రూ.2 లక్షలకు పెంచుతామని, రేషన్‌పై సన్నబియ్యం అందిస్తామని తెలిపారు. అలాగే, మహిళలకు సౌభాగ్యలక్ష్మి కింద రూ.3000 అందిస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీలు గెలిచేది లేదని, వారికి ఓటు వేసి వృథా చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, కార్పొరేటర్లు జంగిలి సాగర్, తుల రాజేశ్వరి-బాలయ్య, కాశెట్టి లావణ్య-శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు, ఆయా డివిజన్ల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ఎస్సారార్ మైదానంలో వాకర్స్‌తో కలిసి క్రికెట్ ఆడుతున్న మంత్రి గంగుల కమలాకర్

### ప్రజలే మా దైవం

కరీంనగర్ ప్రజలే దైవంగా, నగరాభివృద్ధే లక్ష్యంగా తాను పని చేస్తున్నానని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో మార్నింగ్ వాకర్స్‌తో కలిసి ప్రచారం చేశారు. నగరంలో కొనసాగుతున్న అభివృద్ధిని ఓటర్లకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా, తాను నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిస్తే కరీంనగర్‌ను అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న మానేరు రివర్ ఫ్రంట్ పనులు పూర్తయితే దేశంలోనే కరీంనగర్ గొప్ప నగరంగా నిలుస్తుందన్నారు. ఈ అభివృద్ధిపై కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు అవగాహనే లేదని, ఇంకా చిత్తశుద్ధితో ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో వచ్చి మోస పూరిత మాటలు చెప్పేవారి పట్ల జాగ్రత్తగా ఉండాలని, అన్ని ఆలోచించి ఓటేయాలని కోరారు. అభివృద్ధితో పాటు పేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే బీఆర్ఎస్‌కు మద్దతివ్వాలని కోరారు. అభివృద్ధి కొనసాగాలంటే కారుగుర్తుకు ఓటేసి తమను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బండారి వేణు, భూమాగౌడ్, ట్రస్మా రాష్ట్ర నాయకుడు శేఖర్‌రావు, కర్ర సూర్యశేఖర్, చక్రధర్‌రావు, వెంకటేశ్ పాల్గొన్నారు.

### కరీంనగర్ అభివృద్ధే లక్ష్యం

కరీంనగర్ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నానని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. నగరంలోని పలు మసీదుల వద్ద నమాజ్ అనంతరం మంత్రితో పాటు ఎంఐఎం నాయకుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ముస్లింలను కలిసి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ, కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి, తనను నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిస్తే కరీంనగర్‌ను అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. మానేరు రివర్ ఫ్రంట్ పనులు పూర్తయితే కరీంనగర్ గొప్ప నగరంగా మారుతుందన్నారు. మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమ్జద్అలీ, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం నాయకులు సయ్యద్ మొయిజుద్దీన్ ఖాదీర్ యూసుఫ్, అఖిల్ ఫిరోజ్, అలీ బాబా, అజర్ దబీర్, సాజిద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



20వ డివిజన్‌లో ప్రచారానికి తరలివచ్చిన ప్రజలు

## ఉప్పొంగిన అభిమానం

- ప్రభుత్వ పథకాలతో కూడిన ఫ్లెక్సీ ధరించి చేర్యాల వాసి ప్రచారం
- బీఆర్ఎస్‌ను గెలిపించాలని విజ్ఞప్తి

కార్పొరేషన్, నవంబర్ 24: సీఎం కేసీఆర్ వీరాభిమాని అయిన సిద్దిపేట జిల్లా చేర్యాలకు చెందిన మనోహర్ బీఆర్ఎస్‌కు మద్దతుగా వినూత్న ప్రచారం చేస్తున్నారు. నగరంలోని తెలంగాణచౌక్, టవర్‌సర్కిల్‌తో పాటు పలు చౌరస్తాలో శుక్రవారం బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలతో కూడిన ఫ్లెక్సీ ధరించి మైక్ ద్వారా ప్రచారం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితుడినై స్వచ్ఛందంగా బీఆర్ఎస్ తరపున ప్రచారం చేస్తున్నట్లు మనోహర్ తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచినట్లు పేర్కొన్నారు. కరీంనగర్ నియోజకవర్గాన్ని గంగుల కమలాకర్ ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు. నియోజకవర్గం మొత్తం తన సొంత ఖర్చులతో గంగులకు మద్దతుగా ప్రచారం చేస్తానని స్పష్టం చేశారు.



కరీంనగర్‌లో ప్రచారం చేస్తున్న మనోహర్

## ఓట్ల లెక్కింపు కోసం నలుగురు పరిశీలకులు

కలెక్టరేట్, నవంబర్ 24: రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం జిల్లాకు నలుగురు పరిశీలకులను ఎన్నికల సంఘం నియమించింది. ఈమేరకు ఉత్తర్వులు కూడా విడుదల చేసింది. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఒకరి చొప్పున కేటాయించగా, సివిల్ సర్వీసెస్ అధికారులకు బాధ్యతలు అప్పగించినట్లు జిల్లా ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో ఇప్పటికే సాధారణ, పోలీసు, వ్యయ పరిశీలకులుగా ఇతర రాష్ట్రాలకు చెందిన ఐదుగురు అధికారులను నియమించారు. వారు నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో అభ్యర్థులు, ఆయా పార్టీల వ్యవహారశైలిని పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘానికి నివేదికలు పంపుతున్నారు. నాలుగు దశల్లో జిల్లాలో ఎన్నికల వ్యవహారశైలిని పరిశీలించనుండగా, ఇప్పటికే నామినేషన్ల దాఖలు, ఉపసంహరణ ఘట్టాలు ముగిసాయి. ఇక పోలింగ్ అనంతరం లెక్కింపు ప్రక్రియలు మాత్రమే మిగిలి ఉండగా, పకడ్బందీగా పోలింగ్ నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం చేస్తు న్న ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే ఎన్నికల నిర్వహణపై, ప్రచార సరళిపై, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై సంబంధిత పరిశీలకులు పలుమార్లు జిల్లా అధికారులతో సమీక్షించారు. తాజాగా పోలింగ్ ఏర్పాట్లు, నిర్వహణపై ఎప్పటికప్పుడు జిల్లా యంత్రాంగం చేస్తున్న ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం అభ్యర్థులు, రాజకీయ పార్టీ లు చేసిన వ్యయంపై మదింపు చేసి ఎన్నికల సంఘానికి నివేదించనున్నారు. అలాగే ఓట్ల లెక్కింపులో ఎలాంటి సమస్యలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా చేపట్టేలా చర్యలు తీసుకునేందుకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికో లెక్కింపు పరిశీలకుడిని నియమించారు. త్వరలోనే వారు లెక్కింపు కేంద్రాలకు చేరుకోనున్నట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది. లెక్కింపు కోసం కేంద్రాల్లో జిల్లా యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్లు, లెక్కింపు సిబ్బంది, ఇతరత్రా సదుపాయాల కల్పనపై ఆరా తీయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారులు వెల్లడిస్తున్నారు.

## కాంగ్రెస్, బీజేపీల దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలి

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 24: కాంగ్రెస్, బీజేపీల దుష్ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలని బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగులతో కాంగ్రెస్, బీజేపీలు లబ్ధి పొందాలని బీఆర్ఎస్‌పై అసత్య ప్రచారం చేస్తున్నాయన్నారు. ఇప్పటికే లక్షా 60 వేల ఉద్యోగాలు ఇచ్చి మరో 80 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. హుజూరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వర్ధినేని రవీందర్‌రావు, మండలాధ్యక్షుడు సంగెం ఐలయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కన్నెబోయిన శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్వై మండలాధ్యక్షుడు తొగరు భిక్షపతి, బీఆర్ఎస్వై నియోజకవర్గ ఇన్‌చార్జి తొగరు శివకుమార్, బీఆర్ఎస్ నాయకులు రావుల వెంకట్, కాసుగోని కిరణ్‌గౌడ్, బత్తిని సంపత్‌గౌడ్, రాములు, మల్లయ్య, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 6 వరకు పరీక్ష ఫీజు చెల్లించాలి

కమాన్‌చౌరస్తా, నవంబర్ 24: శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని ఎల్ఎల్‌బీ 5వ సెమిస్టర్ విద్యార్థులు డిసెంబర్ 6లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో సూచించారు. అభ్యర్థులు అపరాధ రుసుము ₹300తో డిసెంబర్ 11వరకు ఫీజు చెల్లించవచ్చని ఆయన తెలిపారు. అలాగే, బీఎస్సీ హానర్స్ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజు డిసెంబర్ 6లోగా చెల్లించాలని, అపరాధ రుసుము ₹300తో డిసెంబర్ 11వ తేదీ వరకు చెల్లించవచ్చని వివరించారు.

## స్వేచ్ఛగా ఓటు వేయాలి

గంగాధర, నవంబర్ 24: ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపీడీవో ఎన్ఆర్ మల్హోత్ర సూచించారు. మధురానగర్ చౌరస్తాలో ఓటు హక్కు వినియోగంపై మైనార్టీ బాలికల పాఠశాల విద్యార్థులు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం చౌరస్తాలో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు అనేది వజ్రాయుధమని, ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ప్రజలు ఓటు వేయాలని సూచించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ వారుణి, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు ప్రజలు పాల్గొన్నారు.



ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు